వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
ఆదివారం 15 సెప్టెంబర్ 2024





## ఘనంగా వినాయకుని నిమజ్జనం

ప్రొద్దుటూరు అర్బన్, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త:



స్థానిక నాగేంద్ర నగర్‌లోని వినాయకుని విగ్రహానికి మేళ తాళాలతో శనివారం నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా స్థానిక భక్తులు పురవీధులలో ఊరేగింపు నిర్వహించి అనంతరం అల్లాడుపల్లె దేవలాల దగ్గర కుందూనదిలో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో బాల వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులు తమటం చంద్రశేఖర్ రెడ్డి, భూమిరెడ్డి రవీంద్రా రెడ్డి, గురు, పట్టుపోగుల నాగేశ్వర రావు, హేమ తదితరులు పాల్గొన్నారు.

## వాహణదారులను తనిఖీ చేసిన పోలీసులు

ఖాజీపేట, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త:



డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహణాలు నడుపుతున్న వారిని అడ్డుకొని ఖాజీపేట పోలీసులు చలానా విధించారు. లైసెన్స్ లేకుండా వాహణాలు నడుపుతున్న వారిపై కఠిన చర్యలు తప్పవని సీఐ మోహన్ హెచ్చరించారు. ఖాజీపేట సెంటర్ వద్ద శనివారం డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహణం డ్రైవింగ్ చేస్తున్న మైనర్లను ఆపి తనిఖీలు నిర్వహించారు. మైనర్ల తల్లిదండ్రులను పిలిచి కౌన్సిలింగ్ ఇస్తామన్నారు. బయటకు వచ్చినప్పుడు రికార్డులు తప్పకుండా వెంట తెచ్చుకోవాలన్నారు. హెల్మెట్, లైసెన్స్ లేని పది మంది వాహణదారులకు జరిమాన విధించారు. ఈ కార్యక్రమంలో ఖాజీపేట సీఐ మోహన్, హెడ్ కానిస్టేబుల్ ప్రతాప్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాన్ని అందరి భాగస్వామ్యంతో విజయంతం చేయాలి








కడప, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త

స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని అందరి భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ అన్నారు. శనివారం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహిసేవ కార్యక్రమంలో భాగంగా రాజీవ్ మార్గ్ వద్ద నుండి కోటిరెడ్డిసర్కిల్ వరకు ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా కలెక్టర్, కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డిలు సంయుక్తంగా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం ఈ నెల 17 నుండి అక్టోబరు 1 వ తేది వరకు నిర్వహించనున్న సందర్భంగా ఈ రోజు ఈ ర్యాలీని నిర్వహించామన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీలలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. షెడ్యూలు ప్రకారం 15 రోజుల పాటు జరగనున్న స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు ఎలాంటి అలసత్వం లేకుండా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రతపై మానవహారాలు, స్వచ్ఛతా పరుగు, ర్యాలీ, మారథాన్ రన్, వర్క్‌షాపులు మొదలగు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, బహిరంగ స్థలాలలో స్వచ్ఛత ప్రతిజ్ఞ పాటించి శ్రమదానం నిర్వహించి పరిశుభ్రం చేయాలన్నారు. ప్రజాప్రతినిధులను, ప్రముఖులను భాగస్వాములను చేస్తూ స్వచ్ఛతా హి సేవాపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. స్వచ్ఛతా హీ సేవ నిర్వహణలో ప్రజలు, విద్యార్థుల భాగస్వామ్యం ఉండాలన్నారు. సఫాయి మిత్రా సురక్ష కింద సఫాయి కర్మచారులకు సేఫ్టీ పరికరాలు అందించడం, ఆరోగ్య సదస్సులు నిర్వహించడం వంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించేందుకు ముందుకు రావాలన్నారు. అనంతరం కోటిరెడ్డి సర్కిల్ వద్ద స్వచ్ఛతాహి సేవా కార్యక్రమ సందర్భంగా మానవహారం చేశారు. స్వచ్ భారత్ సేవ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం పట్టణం గుండా వెళ్తున్న బుగ్గవంకను సుందరీకరిస్తామని కలెక్టర్ శివశంకర్ అన్నారు. శుక్రవారం ర్యాలీ ముగిసిన అనంతరం స్థానిక నాగరాజుపేట నారాయణ కాలేజికి సమీపంలో ఉన్న బుగ్గవంక బ్రిడ్జి నుండి వంకను పరిశీలించారు. ఆ ప్రాంతం అంతా ఆయన కలియతిరిగారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లడుతూ నవంబర్లో ఆపరేషన్ బుగ్గవంక పేరుతో బుగ్గవంకను ఆధునికరిస్తామన్నారు. అందులో ఉన్న చెత్త, పిచ్చి మొక్కలను తొలగించి నీళ్ల సాఫీగా వెళ్లేటట్లు చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ అతిధిసింగ్, జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్, ఇంచార్జి మున్సిపల్ కమిషనర్ రాకేష్, చంద్ర, డిఆర్‌డిఎ పిడి ఆనంద్ నాయక్, డిపిఓ ప్రభాకర్‌రెడ్డి, జడ్పీ సిఇఓ సుధాకర్‌రెడ్డి, సమాచార శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, అధికారులు, నేతలు గోవర్ధన్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యువత ఉజ్వల భవిష్యత్తు బాధ్యత మనందరిది

- గంజాయి విక్రయాలపై దాడులు
- మెడికల్‌షాపు యాజమాన్యం పోలీసు శాఖకు సహకరించాలి
- ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయించకండి
- జిల్లా కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ వారికి సూచనలు చేసి ఎస్పీ




కడప క్రైం, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:

జిల్లాలో గంజాయి విక్రయాలపై పోలీసు శాఖ ఆధ్వర్యంలో దాడులు ముమ్మరంగా చేయడంతో గంజాయి వ్యసనానికి అలవాటు పడ్డ యువత ఇతర ప్రత్యామ్నాయ మార్గాలలో భాగంగా మత్తు కలిగే మందుల కోసం మెడికల్ షాపులకు వచ్చే అవకాశం ఉందని ఎట్టి పరిస్థితుల్లో ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులను విక్రయించొద్దని జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు మెడికల్ షాపు నిర్వాహకులకు సూచించారు. శనివారం స్థానిక పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కెమిస్ట్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ వారికి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించి ప్రసంగించారు. ఎవరైనా మత్తు మందులకోసం వస్తే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ జి.మాధవి మాట్లాడుతూ నార్కోటిక్స్‌ను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక రూపొందించిందని తెలిపారు. వైద్యులు, మెడికల్ యాజమాన్యం తమకు సహకరించాలన్నారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ సూపరింటెండెంట్ డా.ఆర్.వెంకట రాముడు మాట్లాడుతూ మత్తు పదార్థాల వల్ల శారీరకంగా, మానసికంగా కలిగే అనర్థాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. మత్తు పదార్థాలకు అలవాటు పెద్దవారికి అవి క్రమంగా ప్రాణాంతకంగా పరిణమిస్తాయన్నారు. కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహామూర్తి మాట్లాడుతూ ఎస్పీ తమను భాగస్వాములను చేస్తూ ఇలాంటి అవగాహన కార్యక్రమం నిర్వహించడం పట్ల కృతజ్ఞతలె తెలిపారు. యువత మెడికల్ షాపులకు వచ్చి మందులను దుర్వినియోగం చేసే అవకాశం ఉందని అసోసియేషన్ వారిని అప్రమత్తం చేయడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం చికిత్సకు ఉద్దేశించిన మందుల దుర్వినియోగం కాకుండా మా వంతు కృషి చేస్తామని కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ ఏఆర్ అదనపు ఎస్పీ కృష్ణారావు, మహిలా పోలీసు స్టేషన్ డీఎస్పీ రమాకాంత్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్‌లు యు.వెంకట కుమార్, హేమ కుమార్, డీఎస్‌సీ బృందంలోని పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.






## 2లక్షల 56వేలు పంచాయతీ నిధులు స్వాహా

చాపాడు, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త:



మండల పరిషత్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న(ప్రైవేటు ఉద్యోగి) బద్రిపల్లి గ్రామ పంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి 2లక్షల 56వేలు నిధులు మరొకరి ఖాతాలోకి మల్లించిన ఘటన వెలుగుచూసింది. వివరాల్లోకి వెలితే అల్లాడుపల్లె గ్రామానికి చెందిన హనీఫ్ బాషా కొద్ది రోజుల నుండి ఎంపీడీఓ కార్యాలయం నందు విధులు నిర్వహిస్తున్నాడు. జనవరి నుండి ఇప్పటివరకు బద్రిపల్లి గ్రామం పంచాయతీ సర్పంచ్ ఖాతా నుండి 15వ ఆర్థిక సంఘం నిధులు సుమారు 2లక్షల 56వేలు మరొకరి ఖాతాకు మళ్లించినట్లు గుర్తించడంతో శుక్రవారం పోలీసు ఫిర్యాదు అనంతరం స్వాహా నిధులు వెనక్కు ఇప్పించేందుకు ఏర్పాటు చేసినట్లు సమాచారం. అదేవిధంగా మండల వ్యాప్తంగా మిగతా గ్రామ పంచాయతీలలో కూడ ఏమైనా నిధులు గోల్‌మాల్ జరిగి ఉన్నాయోమో అని గ్రామ పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు సరి చూసుకుంటే బాగుంటుంది అని పలువురు చర్చించుకుంటున్నారు.

## బదిలీపై వెళుతున్న కానిస్టేబుల్లకు సీఐ సన్మానం

ముద్దనూరు, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త:



ముద్దనూరు అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ నందు 5సంవత్సరాలు విధులు నిర్వహించిన కానిస్టేబుల్లు సురేంద్ర, రమేష్ కడప జిల్లా ఎస్పీ హర్శవర్ధన్ రాజు సాధారణ బదిలీల్లో భాగంగా శనివారం నాడు రిలీవ్ అయి ఇతర మండలాలకు వెళుతున్న వారికి సీఐ దస్తగిరి, సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాసులు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి

దువ్వూరు, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త:

మండల పరిధిలోని ఇడమడక గ్రామానికి చెందిన చెంచుగాళ్ల బాలసుందరం(45) అనే వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మరణించినట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఇడమడకకు చెందిన బాలసుందరం ఈనెల 9వ తేదిన కేసీకెనాల్ వద్ద జరిగిన వినాయక నిమజ్జన కార్యక్రమంలో ఉండగా అదే గ్రామానికి చెందిన నరసింహులు అనే వ్యక్తి మోటార్ సైకిల్‌పై వెళుతూ అజాగ్రత్తగా బాల సుందరాన్ని ఢీ కొన్నాడు. దీంతో బాల సుందరంకు గాయాలు కాగా చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విశమంగా ఉండటంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి బాల సుందరం మరణించారు. బాల సుందరం తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న రాజశేఖర్

చిట్వేలి, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:



స్థానిక ఉన్నత పాఠశాలలో ఆంగ్ల బోధకుడిగా, ఎన్‌సీసీ అధికారిగా రాణిస్తూ ఉత్తమ సేవలు అందించిన పసుపుల రాజశేఖర్ డా.సర్వేపల్లి రాధాకృష్ణ నేషనల్ ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం తిరుపతిలో యువ తేజం ట్రస్ట్ కలాం విజన్ సంస్థ ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి రాధాకృష్ణన్ మునిమనవడు డా.జీవీ సుబ్రమణ్యం శర్మ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. గౌరవ అతిథులుగా ద్రవిడ యూనివర్శిటీ మాజీ వైస్‌చాన్సలర్ కనకాల రత్నం, ట్రస్ట్ ఛైర్మన్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు. అవార్డు గ్రహీత రాజశేఖర్ తనకు అందిన ఈ గౌరవానికి ఆనందం వ్యక్తపరిచారు. మరింత బాధ్యతగా సేవలందిస్తానని తెలిపారు.

## ముద్దనూరు మండలంలో 1538 ఎకరాల్లో కంది పంట సాగు విస్తీర్ణం

ముద్దనూరు, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త:



ముద్దనూరు మండలంలోని నొస్సంవారి పల్లె గ్రామ రైతు రాజుల నారాయణ రెడ్డి సాగు చేసిన కంది పంటను పరిశీలించి రైతుకు తగు సూచనలు, సలహాలు అందించినట్లు మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. కందిపంటలో కలుపు లేకుండా ఉండేందుకు ట్రాక్టర్ సహాయంతో గుంటక ద్వారా సేద్యం చేసే విధానాన్ని గ్రామ రైతులతో కలిసి వ్యవసాయ అధికారి పరిశీలించి తగు సూచనలు అందించారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 1538 ఎకరాల్లో కంది పంటను సాగు చేసినట్లు తెలిపారు. ఎక్కువగా యల్.ఆర్.జి.52, యల్.ఆర్.జి.41, మరియు ప్రైవేటు వంగడాలు(రకాల)ను రైతులు ఎక్కువ సాగు చేశారని తెలిపారు. రైతులు ఈ సంవత్సరం కందిపంట వైపు మొగ్గు చూపారని పంటకు కావలసిన వర్షపాతం సకాలంలో పడితే దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని తెలిపారు. ప్రతి రైతు కంది పంటలో అంతరకృషి(సేద్యం) చేసుకొని కలుపు లేకుండా నిర్మూలించుకుంటే పంట ఏపుగా పెరిగి, దిగుబడులు బాగా ఉంటాయని తెలిపారు. కంది పంటలో రసం పీల్చే పెరుగుల ఉధృతి లేకుండా ముందు జాగ్రత్తగా వేప నూనె ఒక లీటరు నీటిలో 5ఎమ్‌ఎల్ కలిపి పిచికారి చేసుకోవాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు పప్పు దినుసులు పండించే విధంగా రైతులకు అవగాహణ సమావేశాలు ఏర్పాటుచేసి వ్యవసాయ శాఖ ద్వారా సలహాలు, సూచనలు అందిస్తున్నారని తెలిపారు. మార్కెట్‌లో కంది పంట ధర ఆశాజనకంగా ఉండటంతో రైతులు కంది పంటను ఎక్కువగా సాగు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ యస్‌కె సిబ్బంది పవన్‌కుమార్ మరియు గ్రామ నౌకరు మాధవి మరియు గ్రామ రైతులు యన్.నాగమునిరెడ్డి, రామకృష్ణారెడ్డి, జయరామకృష్ణా రెడ్డి, మునిరెడినడ,రామాంజనేయులు రెడ్డిలు పాల్గొన్నారు.

## 7మంది జూదరులు అరెస్ట్

దువ్వూరు, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త:

మండల పరిధిలోని గుడిపాడు గ్రామానికి చెందిన 7మంది జూదం ఆడుతుండగా వారి వద్ద నుంచి 7800 నగదును అలాగే పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వినోద్ కుమార్ తెలిపారు. ముందుగా రాబడిన సమాచారం మేరకు దాడులు నిర్వహించామని ఈ దాడుల్లో వారిని అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేశామన్నారు. వీరిని త్వరలో మైదుకూరు కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు పేర్కొన్నారు.

## బాలికలు హెచ్ఐవీపై అవగాహన కలిగి ఉండాలి

తంబళ్లపల్లె, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:



బాలికలు హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని క స్తూర్బా బాలికల గురుకుల పాఠశాల వవార్డెన్ శైలజ పిలుపునిచ్చారు. శ నివారం పాఠశాలలో ఏపీ రాష్ట్ర ఎ యిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ జిల్లా ఎ యిడ్స్ నివారణ మరియు నియం త్రణ సంస్థ, కృషి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కృషి సంస్థ ఓఆర్‌డబ్ల్యూ ఏఖ మాట్లాడుతూ విద్యార్థులకు ఎయిడ్స్/హెచ్ఐవీ ఎలా వ్యాపిస్తుంది, ఎలా వ్యాపించదు, హెచ్ఐవీ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. హెచ్ఐవీ రోగులు యాక్ట్ 2017, ఏఆర్‌టీ మందులు, ఏపీఎస్ ఏసీఎస్ యాప్, టోల్‌ఫ్రీ నెంబరు 1097 గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో కృషి సంస్థ ఔట్రిచ్ వర్కర్ రేఖ, సావిత్రి పాల్గొన్నారు.

## పెద్దమ్మ గుడికి సంబంధించిన గదులను
# తొలగించే ప్రయత్నం మానుకోవాలి

ప్రొద్దుటూరు, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త:

ప్రొద్దుటూరు పట్టణంలోని స్థానిక నూతన కూరగాయాల మార్కెట్ సమీపంలో ఉన్న పెద్దమ్మ గుడికి సంబంధించిన గదులను తొలగించడానికి మున్సిపల్ అధికారులు జారీ చేసిన ఆదేశాలను విరమించుకోవాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్ మాదిగ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పెద్దమ్మ గుడి ఎదురుగా మున్సిపల్ అధికారుల తీరును నిరసిస్తూ ఆయన దీక్ష చేపట్టారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ దళితుడినైన తన ఆధ్వర్యంలో పెద్దమ్మ గుడిని నిర్మించామని తెలిపారు. ప్రతి సంవత్సరం పెద్దమ్మ గుడి పేరుతో పేదలకు అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. అలాగే ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. కానీ మున్సిపల్ అధికారులు పెద్దమ్మ గుడికి సంబంధించిన గదులను తొలగించేందుకు ఆదేశాలు జారీ చేసినట్లు తమకు తెలిసిందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే మున్సిపల్ అధికారులు గదులను తొలగించే ఆదేశాలను విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పట్టణంలో బంగారు అంగళ్ల మైదానంలో గతంలో ఆర్టీసి బస్సులు తిరిగేవని కానీ ఆక్రమణలకు గురై ద్విచక్ర వాహణాలు కూడ పోయే పరిస్థితి లేదని అలాంటి వాటిని తొగించే ప్రయత్నం ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. కేవలం పెద్దమ్మ గుడిని దళితుడు నిర్మించాడని కారణంతోనే దీనికి సంబంధించిన గదులను తొలగించేందుకు ప్రయత్నం చేయడం బాధాకరమన్నారు. సంచార జాతుల అధ్యక్షుడు పసుపులేటి శివకృష్ణ మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా పెద్దమ్మ గుడి ఏర్పాటుచేసిన సుధాకర్ మాదిగ అనేక సేవా కార్యక్రమాలతో గుడి అభివృద్ధికి కృషి చేశారన్నారు. దాతల సహాయంతో అలాగే తన సొంత నిధులతో ఎంతో కష్టపడి గుడిని నిర్మాణం చేశారని తెలిపారు. ప్రతిరోజు వందలాది మంది భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహిస్తున్నారు. అలాంటి గుడికి సంబంధించిన గదులను తొలగించే ప్రయత్నం చేయడం తగదు అన్నారు. వెంటనే అలాంటి ఆదేశాలను విరమించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కొండయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.



## వరద బాధితులకు రూ.30వేలు సాయం

కడప వైద్యవిభాగం, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:



బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకర్‌రావు ఆదేశాల మేరకు విజయవాడ వరద బాధితులకు రూ.30వేలు కడప జిల్లా బీసీ సంక్షేమ సంఘం, రాష్ట్ర అధ్యక్షుని ద్వారా సీఎం సహాయ నిధికి విరాళంగా అందించడం జరిగింది. వరదలతో అతలాకుతలమైన బాధితులన బాధితులకు తమ వంతు సాయం అందించడం జరిగింది. దాతలు గోవింద నాగరాజు, బత్తుల లింగమూర్తి, ములకాని త్రివిక్రం యాదవ్, సునీల్ జయంత్, కల్యా సుధాకర్, ఆర్ల గంగయ్య, పల్లా నరసింహులు, మునిరత్నం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## వరసిద్ధి వినాయక స్వామి లడ్డు లక్కీడిప్‌లో సంటయ్య యాదవ్‌కు దక్కింది

కడప వైద్యవిభాగం, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:

కడప నగరం ఎన్జీవో కాలనీలో ఏర్పాటు చేసిన 10వ వార్షికోత్సవం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఉత్సవాల్లో శుక్రవారం లడ్డు లక్కీ డిప్ నిర్వహించారు. కడప నగరం 2వ డివిజన్ ఉక్కాయపల్లెకు చెందిన ముద్దం సంటయ్య యాదవ్‌కు అదృష్టం వరించింది. వరసిద్ధి వినాయక కమిటీనిర్వహించిన టికెట్టు రూ.500 వెచ్చించి కొనుగోలు చేయడం జరిగింది. లక్కీడిప్‌లో ఆయనకే తగలడంతో సంటయ్య చాలా సంతోషించాడు. ఈ కార్యక్రమంలో ఎస్.కృష్ణయ్య, శ్రీనివాస్ యాదవ్, రామయ్య,, డాక్యుమెంట్ రైటర్ ఓబులేసు, కుడుముల వెంకట సుబ్బారెడ్డిలు సంటయ్యకు శుభాకాంక్షలు తెలిపారు.

# తగ్గిన దిగుబడి - పెరిగిన ధరలు

### మదనపల్లెలో టమోటా కిలో రూ.44

మదనపల్లె, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :



టమోటాకు ఉన్నఫలంగా ధరలు పెరిగాయి. శనివారం మార్కెట్‌యార్డులో కిలో టమోటా రూ.44లు ధర పలికింది. ఒక్కసారిగా ధరలు పెరగడంతో టమోటా రైతులు ఆనందోత్సవాలు వ్యక్తం చేస్తున్నారు. గత వారం రోజులుగా ధరలు మోస్తారుగా పెరుగుతున్న విషయం తెలిసిందే. అయితే ఒక్కసారిగా ధరలు పెరగడం వల్ల టమోటా రైతుల్లో ఎనలేని ఆనందం కలుగుతోంది. దిగుబడి తగ్గడం వల్లే ధరలు పెరిగాయని వ్యాపారస్తులు చెబుతున్నారు. ఇన్నాళ్ళు 400నుంచి 500మెట్రిక్ టన్నుల వరకు మార్కెట్‌కు టమోటాలు వచ్చాయి. శనివారం 90మెట్రిక్ టన్నులు మాత్రం టమోటాలు రావడం జరిగింది. బయట ప్రాంతాల్లో టమోటాకు డిమాండ్ పెరగడం వల్లే ధరలు పెరిగాయని వ్యాపారస్తులు చెబుతున్నారు. టమోటా వ్యాపార లావాదేవీలకు మదనపల్లె మార్కెట్‌యార్డు రాష్ట్రంలోనే పేరుపొందింది. ఇక్కడ నుంచి మహరాష్ట్ర, తమిళనాడు, కేరళ, ఒడిస్సా, తెలంగాణ, రాష్ట్రాలతో పాటు వివిధ పట్టణ ప్రాంతాలకు ఎగుమతి అవుతాయి. టమోటా ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉందని వ్యాపారస్తులు చెబుతున్నారు.

## గెవితిమ్మరాయ ఆలయంలో ప్రత్యేక పూజలు

రామసముద్రం, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :



మండలంలోని దిన్నిపల్లె సమీపంలోని కొండపై వెలసిన గెవితిమ్మరాయస్వామి ఆలయంలనో ఆలయ ప్రధాన అర్చకులు కులశేఖర్‌బట్టర్ స్వామికి ఉదయం పలు రకాల పుష్పాలతో అలంకరణ చేసి అర్చనలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు గోవిందా నామస్మరణలతో మారు మ్రోగింది. చెంబకూరు రోడ్డులోని శనేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించడం జరిగింది.

## వైసిపి అసత్య అరోపణలు తిప్పి కొట్టాలి

కురబలకోట, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :



వరదల్లో బాధితులను ఆదుకొని వివిద సహాయాలు కూటమి ప్రభుత్వం చేస్తుంటే వైసిపి నాయకులు అసత్య అరోపణలు చేయడం తగదని మండల టిడిపి నాయకలు జంగా రాఘవరెడ్డి తెలిపారు. రాష్ట్రంలో వరదలు సంబవించిన ప్రాంతాల్లో సిఎం చంద్రబాబునాయుడు పర్యటించి బాధితులకు అండగా నిలిచారన్నారు. వారికి అన్ని విధాలుగా ఆదుకొని భరోసా కల్పించామన్నారు. దీనిని జీర్ణించుకోలేని మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రకాశం బ్యారేజి దెబ్బతినేలా బోట్లుతో ఢీ కొట్టించేందుకు కుట్ర పన్నారని తేటతెల్లమైందన్నారు. ఇలాంటి కుట్రలు చేయడం తగదన్నారు. వరద బాధితులకు కనీసం ఎలాంటి ఆర్థికసాయం చేయకుండా చౌకబారు విమర్శలు చేసి లబ్ధి పొందాలని చూడడం తగదన్నారు. దీనిని బాధితులు కూడా ముక్తకంఠంతో ఖండిస్తున్నారని తెలిపారు.

## వెంకటరమణారెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి

పీలేరు , సెప్టెంబరు 14 ప్రభాతవార్తః



వైసీపీ సీనియర్ నాయకులు భవనం వెంకటరమణారెడ్డి కుటుంబాన్ని మాజీ మంత్రి, పుంగనూరు శాసన సభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పరామర్శించారు. మండలంలోని వేపులబైలు పంచాయతీ గాయంవారిపల్లెలో వెంకటరమణారెడ్డి తల్లి రంగమ్మ పది రోజులు క్రితం మతిచెందడంతో శనివారం గాయంవారిపల్లెలో ఆమె కర్మక్రియలకు మాజీ మంత్రి హాజరైయ్యారు. అనంతరం ఆమె చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నల్లారి తిమ్మారెడ్డి, గాయం పుల్లారెడ్డి, గాయం భాస్కర్‌రెడ్డి, గాయం నాగభూషణంరెడ్డి, గాయం మధుసూధన్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, యర్రమరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, హబీబ్‌బాషా నారే వెంకటరమణారెడ్డి, అమరనాధరెడ్డి, ఎన్‌వి.చలపతి, ఆనంద్, షాహీర్. మునీర్, రమణ, ఆబిద్ పాల్గొన్నారు.

## ఫ్రైడే ను డ్రై డేగా పాటిస్తే దోమలను నియంత్రించవచ్చు

పీలేరు, సెప్టెంబరు 14 ప్రభాతవార్తః

నియోజకవర్గంలోని వాల్మీకిపురం మండలంలో ప్రతి శుక్రవారంను డ్రై డేగా పాటిస్తే దోమల పెరుగుదలను నియంత్రించవచ్చు తద్వారా దోమకాటు ద్వారా వ్యాప్తి చెందే మలేరియా, ఫైలేరియా, డెంగీ, మెదడువాపు, జ్వరాలు ప్రబలకుండా చేయవచ్చు అని హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ అన్నారు. మండలంలోని చింతపర్తి పీహెచ్‌సీ వైద్యులు శ్రీవిద్య పర్యవేక్షణలో కల్పించారు . ప్రతి శుక్రవారం ఇంటిలోని నీటి తొట్టెలను ఖాళీచేసి గాలికి, లేదా ఎండలో ఆరబెట్టడం వల్ల నీటిలో దోమలు గుడ్లు పెట్టకుండా నిర్మూలించవచ్చు అన్నారు. సాయంత్రం పచ్చి వేపాకు పొగ వేసుకోవడం, సాయంత్రం ఇంటి లైట్లు వేసినప్పుడు అర గంట తలుపులు, కిటికీలు మూసివేయడం వల్ల బయట ఉన్న దోమలు ఇంటిలోకి రావని తెలిపారు. పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల దోమల వద్దిని అరికట్ట వచ్చని తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పీ మౌనిక, రాణి, ఆశకార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్తులకు అవగాహన సదస్సు

పీలేరు, సెప్టెంబరు 14 ప్రభాతవార్తః



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ యూనిట్, కోర్ వలంటరీ ఆర్గనైజేషన్ సహకారంతో మీకు తెలుసా? అనే పేరుతో హెచ్ఐవీ ఎయిడ్స్, దాని నివారణ గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శనివారం పట్టణంలోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో అవగాహన కార్యక్రమం విద్యార్థులకు నిర్వహించారు. వైరస్ఎలా వ్యాపిస్తుంది, ఎలా వ్యాపించదు అనే సాధారణ అపోహలు, ఇన్‌ఫెక్షన్, నివారించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడంపై ప్రోగ్రామ్ దష్టి సారించింది. ఎయిడ్స్ బారిన పడిన వారిపట్ల వివక్ష లేకుండా జీవించడం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. క్షయ వ్యాధి (టీబీ) చికిత్స ఎంపికల యొక్క ప్రాముఖ్యత, నివారణలో కండోమ్‌లు పోషించే కీలకపాత్ర గురించి వివరించారు. ఈ అవగాహన కార్యక్రమం కేవలం విద్యను మాత్రమే కాకుండా సమాజంలో హెచ్ఐవి, ఎయిడ్స్‌తో జీవిస్తున్న వ్యక్తుల పట్ల మరింత సమగ్రమైన దయతో కూడిన దక్పధాన్ని పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకుందని కోర్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు కె.రాజమ్మ, షర్మిల, రెడ్డిరాణి, పాఠశాల సిబ్బంది చందన, ప్రమీల, హేమావతి బాయి తదితరులు పాల్గొన్నారు.

## చదువులు మాట దేవుడెరుగు - గిరిజనులతో విద్యకు బదులు వెట్టిచాకిరీ చేయిస్తున్న అంబేద్కర్ మినీ గురుకులం





రైల్వే కోడూరు అర్బన్, సెప్టంబర్14, ప్రభాతవవార్త :

కోడూరు నియోజకవర్గంలోని మీనీ గురుకులంలో కొన్ని నెలలుగా వంట మనుషులు లేకపోవడంతో పాఠశాలలోని విధ్యార్యులను వంట పని మనుషులుగా తీర్చిదిద్దుతున్న పాఠశాల ఉపాధ్యాయులు, ఎంతో కష్టపడి కూలీ నాలి చేసి గిరిజనులైన ఆడపిల్లలను కొద్దో గొప్పో అయినా చదివిద్దామనే ఉద్దేశ్యంతో ఆర్థిక స్తోమత లేకపోయినప్పటికీ ప్రతి రోజు కూలికి వెళుతూ తమ పిల్లలు ఆకష్టం పడకూడదని ఎక్కడెక్కడి నుంచో ఎస్టీ బాలికలను ఈ పాఠశాలలో చేర్పించి మూ పాప చదువుకుంటుంది అని వారి పని వారు చేసుకుంటుంటే పాఠశాల వార్డెన్ మాత్రం వారిని వంట మనుషులుగా పని మనుషులుగా తీర్చిదిద్దుతున్నా కూడా పట్టించుకోని అధికారులు, వారం వారం విజిటింగ్ అని ఎస్టీ బాలికల అభ్యున్నతికి వారి అభివృద్ధికి తోడ్పడుతున్నామని ప్రగల్భాలు పలుకుతూ చాలా మంది అధికారులు పండగలకి, కొన్ని స్పెషల్ డేస్ కు అక్కడే సెలబ్రేట్ చేస్తూ ఉంటారు. అయితే అవన్నీ కూడా వారి అభివృద్ధికి కాదు కదా వారు మాట్లాడడానికి కూడా అవకాశం ఇవ్వలేదు. ఎవరైనా బయటికి చెబితే ప్రాణాలు తీస్తామని ఎవరైతే బయటికి ఇవన్నీ చేరవేస్తారో వారిని పాఠశాల నుండి పంపించి వేస్తామని, తాము చెప్పిందే వేదం అని పిల్లలను బానిసలుగా చేసి విధ్యాబోధన చేయకుండా పనిభారం ఎక్కువ చూపించి పిల్లలను దేనికి పనికి రాకుండా చేస్తూ వారి భవితరాల భవిష్యత్తును నాశనం చేస్తున్నారు. ఇది ఇప్పుడు కొత్తగా జరగడం లేదని ఇదివరకే ఈ పాఠశాల మీద చాలా అభియోగాలు ఉన్నాయని అధికారులను డబ్బుతో మభ్యపెడుతూ వస్తున్నారని, గత శుక్రవారం విఆర్వోతో కలసి పాఠశాల ను సందర్శించిన విలేకరులకు విస్తుపోయో నిజాలు తెలియడంతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు లేకపోవడంతో ఇన్‌చార్జి ప్రధానోనపాద్యాయులను వివరణ కోరగా తప్పు జరిగిందండి, ఇంకెప్పుడూ ఇలా జరగకుండా చూస్తాం ఈ విషయం పేపర్లో రాకుండా చూడాలని బ్రతిమలాడడం కొసమెరుపు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాల వార్డెన్ నుంచి పిల్లలను కాపాడి, త్వరితగతిన పిల్లల భవిష్యత్తుకు బాటలు వేయాలని దీనికి బాధ్యులైన ప్రతి ఒక్కరిని సస్పెండ్ చేయడమే కాకుండా తగిన శిక్ష వేయాలని ఇటువంటివి ఇంకెప్పుడూ తిరిగి మళ్లీ జరగకుండా చూడాలని పిల్లల తల్లిదండ్రులు కోరుకొంటున్నారు.

## ఘనంగా వినాయక చవితి నిమజ్జన వేడుకలు



పీలేరు, సెప్టెంబరు 14 ప్రభాతవార్తః

వినాయక చవితిని పురస్కరించుకుని గత 8 రోజులుగా పూజలు అందుకుంటున్న గణపయ్య మేళ్లచెరువు గ్రామం హరిజనవాడలో 9వ రోజు బాజాబజంత్రీలు నడుమ పుష్ప పల్లకిపై ఊరేగింపుగా తీసుకెళ్లి గంగమ్మ ఒడిలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీయస్,ఎంఎస్‌పీ నాయకులు జై బోలో గణేష్ మహరాజ్ అంటూ ఎమ్మార్పీయస్ అధినేత మందకష్ణ మాదిగ చిత్రపటాలతో ఎమ్మార్పీయస్ జెండాలు పట్టుకుని ఊరేగింపుగా హజరినవాడ నడిగడ్డ ఆశ్రమం మీదుగా ఊరేగింపుగా వెళ్లి గ్రామ సరిహద్దుల్లోని పెద్ద చెరువులో గణపయ్యను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండికోట వెంకటేష్, శరణ్‌కుమార్, భాస్కర్, విద్యార్థి విభాగం రాజశేఖర్, కళ్యాణ్, కు మార్, మధు తదితరులు పాల్గొన్నారు.

## పీలేరులో 60 కేసులు పరిష్కారం

పీలేరు, సెప్టెంబరు 14 ప్రభాతవార్తః



పీలేరులో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో మొత్తం 60 కేసులు పరిష్కారం కావడంతో పాటు రూ.80లక్షల రెండువేల రెండు వందలు చెల్లింపులకు అంగీకారం కుదిరింది. చిత్తూరు 9వ జిల్లా అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు, పీలేరు సీనియర్ సివిల్ జడ్జి కె.రవి ఆధ్వర్యంలో లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీపీలు శారద, చంద్రకుమార్, న్యాయవాధులు రెడ్డెప్ప, పీలేరు బార్ అసోసియేషన్ అద్యక్షులు పురుషోత్తంరెడ్డి, భవానిశంకర్, వెంకటరమణారెడ్డి, షౌకత్ అలీ, శివకుమార్‌రెడ్డి, నాగరాజ, వేణుగోపాల్ పాల్గొన్నారు.

## 5 మంది జూదరులు అరెస్టు

రామాపురం, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:



మండలంలోని సుద్దమల్ల పంచాయతీ దూదేకులపల్లి సమీపంలో చీకు పొదల్లో శనివారం జూదమాడుతున్న 5 మందిని అరెస్టు చేసి వారి వద్ద రూ.10670 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెంకట సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందస్తు సమాచారం మేరకు జూదం ఆడుతున్న వారిపై తమ సిబ్బందితో దాడి చేసి అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# ఆమె సేవలను 'బ్రిక్స్' మెచ్చింది!




**వారిది విశాఖపట్నం నాన్న రెహమాన్ లారీ డ్రైవర్, అమ్మ మదీనాబీబీ చికెన్ దుకాణం నడుపుతారు. పేద కుటుంబం నిరక్ష్యరాస్యులు అయినా ఆ తల్లిదండ్రులు ఎక్కడా వెనకడుగు వేయలేదు. పిల్లలను బాగా చదువుకోవాలని ప్రోత్సహించారు..** వారి కృషి ఊరికే పోలేదు. కుమార్తెల్లో ఒకరైన ఆయేషా ఆ కుటుంబప్రతిష్ఠను మరో స్థాయికి తీసుకెళ్లారు. బ్రిక్స్ దేశాల యూత్ సమ్మిట్లో పాల్గొని అందరి ప్రశంసలందుకున్నారు. తన ప్రస్థానం గురించి అడిగితే ఆమె ఇలా చెబుతారు.. మేం ముగ్గురమ్మాయిలం. అమ్మ నాన్న చదువు కోలేదు. మాకు సొంతిల్లు కూడా లేదు. కానీ నాన్న మమ్మల్ని చదువుకోవాలని నిరంతరం ప్రోత్సహించేవారు. ప్రభుత్వ స్కూళ్లలోనేచదివినా మాకు ఎలాంటిలోటూ రానిచేనచవారు కాదు. పెద్దక బిటెక్, రెండో అక్క ఎంబిఎ చదివారు. నేను విసయనగరం కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయంలో పిజి చదివా. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఆర్గానిక్ కెమిస్ట్రీలో పిహెచ్‌డి సీటు సాధించా. అంత పెద్ద చదువులు చదివించలేని అమ్మానాన్నలను కష్టపెట్టలేక ఫెలోసిప్‌తో సర్దుకుంటానని వారికి చెప్పి వచ్చా. అన్నట్లుగానే ఇప్పటికీ ఇంటి నుంచి డబ్బులు తీసుకోలేదు. నా ఫెలోసిప్ డబ్బులనే సరిపెట్టుకున్నా. పిహెచ్‌డి చేస్తున్నప్పుడే విద్యార్థి రాజకీయాల్లో ప్రవేశించాను దానికో నేపథ్యం ఉంది. డిగ్రీ చదువుతున్న సమయంలో ఫీజు రీలయంబర్స్‌మెంట్ నిలిచిపోతే ఎబివిపి కార్యకర్తలు మా తరఫున పోరాడారు. నాకూ అలా అందరి తరఫున నిలబడాలని, నాయకురాలిగా ఎదగాలని అనిపించేది. సెంట్రల్ యూనివర్సిటీకి వచ్చాక దానికో రూపం వచ్చింది. ఎబివిపి సభ్యత్వం తీసుకుని సంస్థాగత కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొనేదాన్ని. హెచ్‌సియూలో ఎబివిపిలో చేరిన ఏకైక ముస్లిం అమ్మాయిని నేనే. చదువుకుంటూనే యూనివర్సిటీ తరఫున పలు సామాజిక సేవా కార్యకలాపాల్లో పాల్గొన్నాను. మానవ హక్కులు, రుతుక్రమం సమయంలో పాటించాల్సిన శుభ్రత గురించి మురికివాడల్లో ప్రచారం చేశాను. మహిళా సాధికారత కోసం మిషన్ సహస్రి కింద పలు కార్యక్రమాల్లో పాల్గొన్నాను. అటు చదువునూ ఎక్కడా నిర్లక్ష్యం చేయలేదు. ఇటీవల రష్యాలో జరిగిన బ్రిక్స్ సదస్సుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి నేను మాత్రమే ఎంపికయ్యాను. యూత్ కమ్యూనిటీ సర్వీసెస్, వాలంటరీ వర్క్‌లపై నన్ను బ్రిక్స్ సదస్సు అభినదించింది. వివిధ విషయాలపై నా ప్రతిపాదనలను కేంద్ర మంత్రి రక్షా ఖాడ్సే కూడా ప్రశంసించారు. ఇంట్లో ముగ్గురూ ఆడపిల్లలే.. ఒక్క కొడుకు లేదని తలోకరకంగా మాట్లాడేవారు వాటిని పట్టించుకోకుండా నాన్న ప్రోత్సహించేవారు. సొంతంగా ఎన్జీవో ఏర్పాటుచేయాలని పిహెచ్‌డిలో చేరినప్పుడే నిశ్చయించుకున్నా.







# ఆకట్టుకునే ముత్యాల చోకర్



శ్రావణంలో పూజలు, పెళ్లిళ్ల, వ్రతాలు..చాలానే ఉంటాయి. ఈ సందర్భాల్లో పట్టు చీరలు కట్టి నిండుగ అనిపించాలని ఎవరు కోరుకోరు చెప్పండి. ఇలాంటప్పుడు మెడలో చోకర్ పెడితే ఆ కళే వేరు. అయితే నిన్న మొన్నటిలా బంగారంతో చేసినవీ, ఆడంబరంగా కనిపించేవి కోరుకోవడం లేదు ఈ తరం అమ్మాయిలు. సింపుల్‌గా ఉండాలి. స్టైలిష్‌గా కనిపించాలి అంటున్నారు. కాలాన్ని బట్టి దుస్తులు, చాక్సెసరీల్లోనే.. నగల్లోనూ ఫ్యాషన్లు ఎప్పటికప్పుడు మారిపోతూ ఉంటాయి. అలాంటి అందం తెచ్చే వాటిల్లో ముత్యాలది ప్రత్యేపాత్ర. అందుకే వీటితో చేసిన బోకర్లు ఇప్పుడు ట్రెండింగ్‌లోకి వచ్చాయి. పండగ అయినా వేడుక అయినా.. ఇదొక్కటి మెడలో పెట్టుకుంటే చాలు.. మెరిసిపోవచ్చు. మధ్యలో చిన్న పెండెంట్.. చుట్టూ ముత్యాలు ముఖాన్ని చంద్రబింబంలా మెరిపిస్తాయి. వాటిని ఓ సారి మీరు చూసేయండి.













## ఆర్టిపిపి అధికారులు పట్టించుకోరా సమస్యను పరిష్కరించరా?

### -బ్రహ్మ సాగర్ వాటర్ రహదారి సైడు పారుతున్న నీరు.

### -పొరపాటున వాహనదారులు సైడ్ దిగితే ప్రమాదమే

మైదుకూరు,సెప్టెంబర్ 14,ప్రభాతవార్త:



బ్రహ్మ సాగర్ నుండి ఆర్టిపిపి అధికారులు పైపులైన్ ద్వారా వాటర్ తీసుకెళ్తున్నారు. ఈ పైపులైన్ ద్వారా వెళ్లే వాటర్ లీకేజీలు అరికట్టడంలో ఆర్టిపిపి అధికారులు పట్టించుకోలేదు సమస్యను పరిష్కరించడం లేదు మైదుకూరు మున్సిపాలిటీలోని ఇందిరమ్మ కాలని రహదారి పక్కనే గత కొన్ని రోజుల నుండి లీకేజ్ వల్ల వాటర్ బుగ్గ భూమి పైకి వస్తూ రహదారి వెంబడి వాటర్ పారుతున్న సమస్యను పరిష్కరించడంలో అధికారులు విఫలం అంతే కాదండోయ్ అక్కడ రెండు మూడు యాక్సిడెంట్లు కూడా జరిగాయి అయినా స్పందించని అధికారులు,ఆఫీసుకెళ్తూ నిధులు నిర్వహిస్తూ ఉంటారు.పైపు లీకేజ్ రహదారి పై వెళ్తున్న సమస్య వైపు చూసి లీకేజీ సంబంధించిన అధికారులకు ఫిర్యాదు చేయలేదో మాకెందుకులే అని వదిలేరో వారికే తెలియాలి. వాహనదారులు బాటసారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు పోరుమామిళ్ల వైపు నుండి వచ్చే వాహనాలు పొరపాటున సైడ్ దిగితే అంతే ప్రమాదం పొంచి ఉంది. మైదుకూరుకి రావాలన్న రోడ్డు పైకి చేరుకునేటప్పుడు వాటర్ లీకేజీ గుంత పొరపాటున చూడకపోతే ప్రమాదమే ఇంత జరుగుతున్న అధికారులు మాత్రం పైపు లీకేజీని అరికట్టడంలో నిర్లక్ష్యం.ఇప్పటికైనా అధికారులు జిల్లా కలెక్టర్ వారు ఈ ప్రమాదాన్ని చూసి లీకేజీని అరికట్టేలా చర్యలు చేపట్టాలని స్థానిక ఇందిరమ్మ కాలని వాసులు వాహనదారులు, బాటసారులు వేడుకుంటున్నారు. మరి ఈ లీకేజీని అరికట్టి శాశ్వత పరిష్కారాన్ని చేపట్టాలని ప్రజలు వేడుకుంటున్నారు మరి ఏ మాత్రం స్పందిస్తారో వేచి చూడాలి.

## ఘనంగా ఘననాదుని నిమజ్జనం

లక్కిరెడ్డిపల్లె,సెప్టెంబర్ 14,ప్రభాతవార్త:



వినాయక చవితి సందర్బంగా మండలంలో 8 రోజులుగా ఘననాదునికి పూజలు నిర్వహించారు. శనివారం అయప్ప స్వామి గురుసీస్వామి వెంకటరమణ తమ కుటుంభ సభ్యులు లక్కిరెడ్డిపల్లె మూడురోడ్ల కూడలిలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద ఘణనాదునికి ఘనంగా పూజలు నిర్వహించి అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. లక్కిరెడ్డిపల్లె, గాండ్లపల్లె, సోముల వాండ్లపల్లె గ్రామాలల్లో వినాయకుని నిమజ్జనం కార్యక్రమం నిర్వహించారు.

## ఎక్సైజ్ శాఖ వారి ఆధ్వర్యంలో చంద్రబాబు నాయుడికి క్షీరాభిషేకం

లక్కిరెడ్డిపల్లె,సెప్టెంబర్ 14,ప్రభాతవార్త:



ఎక్సైజ్ మరియు ప్రొహిషన్ శాఖవారి ఆధ్వర్యంలో స్థానిక ఎక్సైజ్ స్టేషన్లో అన్నమయ్య జిల్లా ఎక్సైజ్ సూపర్నెంట్ శ్రీనివాసులు తమ సిబ్బందితో కలిసి శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్బంగా గత ప్రభుత్వంలో ఎక్సైజ్, స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ను రెండుగా విడదీశారు. మళ్లి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రొబిషన్, ఎక్సైజ్ ఏకీకృతం చేసినందుకు చంద్రబాబు నాయుడికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో ప్రొబిషేనం జాయింట్యాక్షన్కామిటి ఆదేశాల మేరకు అన్ని ఎక్సైజ్ శాఖ కార్యాలయాలల్లో చంద్రబాబు నాయుడుకి పాలభిషేకం చేశారని సూపర్నెంట్ శ్రీనివాసులు తెలిపారు. ఇక నుంచి ఎకైజ్ శాఖలో పనిచేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిఐ చంద్రశేఖర్ నాయుడు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేస్తా

సిద్దవటం, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:



సిద్దవటం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేస్తానని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్రెడ్డి తెలిపారు. సిద్దవటం 30 పడకల ఆసుపత్రిలో ఎమ్మెల్యే అధ్యక్షతన ఆసుపత్రి డెవలప్మెంట్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గంలో చక్కటి వాతావరణంలో పేద రోగులకు వైద్య సేవలందించేందుకు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అన్ని వసతులతో ఆసుపత్రిని నిర్మించిందన్నారు. వైద్యులు పేద రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్బంగా ఆపరేషన్కు సంబంధించిన కొన్ని పరికరాలు ఆసుపత్రికి అవసరమని వైద్యులు కోరగా హెచ్డీఎఫ్ నిధుల నుంచి కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి ఏకుల రాజేశ్వరిరెడ్డి, జడ్పీటీసీ సభ్యులు శ్రీకాంత్రెడ్డి, ఉప మండలాధ్యక్షులు నారపురెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆసుపత్రి డైరెక్టర్లు ఆలం గోపాలస్వామి, కుప్పం సుబ్బారెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు సయ్యద్ నూర్, వైసీపీ మండల కన్వీనర్ నీలకంఠారెడ్డి, మాజీ నిత్యపూజకోన ఆలయ ఛైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఇసుక డంపింగ్ యార్డుకు అడ్డుపడడం తగదు

సిద్దవటం, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:



సిద్దవటం మండలం జ్యోతి గ్రామ పంచాయతీ ప్రభుత్వ ఇసుక డంపింగ్ యార్డుకు అడ్డుపడడం తగదని సిద్దవటం మండల తహసీల్దారు మురాద్షావలీ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యోతి పెన్నానది ప్రభుత్వ ఇసుక డంపింగ్ వద్ద పిన్నపురెడ్డి వెంకట సుబ్బమ్మ అనే మహిళ ప్రభుత్వ ఖజానాను గండి కొడుతూ వాహనాలు వెళ్లకుండా అడ్డగించడం చట్ట విరుద్దమని ఆ మహిళకు అక్కడ ఎటువంటి ప్రభుత్వ భూమి లేదని సర్వే చేసి కూడా తెలిపామని సర్వే నెంబరు 143/1, 143/2, ప్రభుత్వ భూమిగా కలదని ఆమెకు ఎలాంటి హక్కు లేవని ఆర్ఎస్ఆర్ ప్రకారం 2001లో ప్రభుత్వ చుక్కల భూమిగా ఉందని ఆమెకు ఎలాంటి హక్కు లేదని ఆయన తెలిపారు. ప్రభుత్వ ఇసుక రవాణా యథావిధిగా జరిగేలా సిద్దవటం పోలీసు శాఖ అనుమతితో మహిళా పోలీసులతో అడ్డుపడుతున్న మహిళలను స్థానిక పీఎస్కు తీసుకెళ్లమని చెప్పామని ఆయన అన్నారు. ఆ ప్రాంతానికి సిద్దవటం మండల ఎస్సై చిరంజీవి ఆధ్వర్యంలో మహిళా పోలీసులు చేరుకొని అడ్డుపడుతున్న మహిళను అదుపులోకి తీసుకున్నారు. యథాతథంగా ప్రభుత్వ ఇసుక రవాణా జరిగేందుకు మార్గం సుగమమైందన్నారు.

## రాష్ట్ర సీఎం, ఎక్సైజ్శాఖ మంత్రి చిత్ర పటాలకు ఘనంగా పాలాభిషేకం

సిద్దవటం, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:



రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎక్సైజ్ శాఖామంత్రి కొల్లు రవీంద్ర చిత్ర పటాలకు శనివారం ఎక్సైజ్ శాఖ పోలీసు స్టేషన్లో ఘనంగా పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఎక్సైజ్శాఖ సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మా శాఖను నిర్లక్ష్యం చేసి వ్యవస్థలు విభజించి సర్వనాశనం చేసి మాకున్న అధికారం మొత్తం మంట కలిపారని నూతన కమిటీ ప్రభుత్వం వచ్చాక ఎన్ఫోర్స్మెంట్ శాఖ రద్దు చేయడం చాలా సంతోషకరమని అప్పటి ప్రభుత్వంలో మా శాఖకు లేని అధికారం ఇచ్చి మా డిపార్ట్మెంట్లో ఉన్న హక్కులను సర్వనాశనం చేశారని సీఐ వెల్లడించారు. గత ప్రభుత్వంలో ఎక్సైజ్ శాఖను రెండు విభాగాలుగా విడగొట్టి ఎస్పీబీ వింగును ఏర్పాటు చేశారని అస్తవ్యవస్థలైన అధికారలు ఇవ్వడం ఎక్సైజ్ శాఖ పూర్తిగా మరుగున పడడం జరిగిందని ఎస్సై శాఖ సర్వహక్కులు వచ్చే విధంగా ఈ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం చాలా సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## తీరుమారని పంచాయితీ కార్యదర్శులు, మండల డాక్టర్లు

పెనగలూరు,సెప్టంబర్14,ప్రభాతవార్త :



మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయితీలలో పారిశుద్ద్యం లోపించింది. ముఖ్యంగా ప్రతి గ్రామినికి వెళ్లే దారికి ఇరువవైపులా కంపచెట్లు పెరిగి పాదచారులకు, ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ప్రభుత్వాలు మారినా తమ బ్రతుకుల్లో మార్పు వచ్చేనా అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. మండలంలో ఎటు చూసినా మురికినీటి కాల్వలు, వైద్య సిబ్బంది నర్లక్ష్య దోరణితో ఎక్కడా కూడా బ్లీచింగ్ చల్లిన పాపాన పోలేదని ప్రజలు వాపోతున్నారు. దీంతొ దొమలు ఎక్కువై ప్రజలకు విషజ్వరాలు వస్తున్నాయి. ఇంత జరుగుతున్నా అటు పాలకులు గానీ ఇటు అధికారులు గానీ స్పంధించిన పాపాన పోలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పంధించి పల్లెల్లో పారిశుద్ద్యం చర్యలు చేపట్టి ప్రజల ఆరోగ్యం కాపాడాలని అలాగే పల్లెలకు వెళ్లే దారికి ఇరువైపులా ముళ్ల కంచెను తొలగించాలని తెలిపారు. అదేవిధంగా ప్రతి గ్రామంలో వీధిలైట్లు లేక నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రజలు వాపోయారు. వాటి విషయం కూడా ఆలోచించి ప్రజలకు మేలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## 2 ట్రాక్టర్లు, టిప్పర్ సీజ్

పెండ్లిమర్రి, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:

మండలంలో అక్రమంగా ఇసుకను పాపాఘ్ని నది నుంచి తరలిస్తున్నట్లు సమాచారం రావడం ఎస్సై మధుసూదన్రెడ్డి తన సిబ్బందితో దాడులు నిర్వహించి 2 ట్రాక్టర్లు, ఒక టిప్పర్ సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. ఎక్కడైనా అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే డ్రైవర్ లైసెన్సు రద్దు చేస్తామని అనుమతులు ఉన్న చోట తరలించాలని లేనిచోట తరలిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మానవత సమస్త ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు

రైల్వేకోడూరు,సెప్టెంబర్ 14,ప్రభాతవార్త:



మానవత సమస్త ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని సమస్త చైర్మన్ కీర్తి పాటి,ప్రసాద్ వర్మ తెలిపారు. శనివారం రైల్వేకోడూరు మండలంలోని జెంగిట వారి పల్లెకు వెళ్లే దారిలో ఉన్న శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ సత్రంలో మానత కార్య వర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ మానవత ఆధ్వర్యంలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలను రూపొందిస్తున్నామని తెలిపారు.అందరి సహకారంతో ముందుకు పోతామని తెలిపారు.మానతలో సభ్యత్వాలు తీసుకొని మానవ సమాజంకు మంచి పనులు చేయించాలని పేద విద్యార్థులను చదివించడం వంటి కార్యక్రమాలు చేపట్టడానికి అందరూ ముందుకు రావాలన్నారు.మానత వ్యవస్థాపకులు ఎన్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ మానత సంస్థను 2024 లో పశ్చిగోదావరి జిల్లా జగ్గారెడ్డిగూడెంలో 108 సభ్యత్వలతో ఆవిర్భావం చెందిందన్నారు. పర్యావరణ పరిరక్షణ ఉచిత వైద్య శిబిరాలు నైతిక విలువలు బోధన రక్తధాన శిబిరాలు శాంతి ర్యాలీలు నిర్వహణ ఆత్మీయ సహకారం ప్రతిభ పేద విద్యార్థులకు పుస్తకాలు తదితర కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మానత సమస్తకు చెందిన ఎన్,సహదేవరెడ్డి, రామానుజుల రెడ్డి. ఏ,శ్రీనివాసులు. పిజనాగేంద్ర, పి.ఉదయ శంకర్ రెడ్డి, ఎం.చంద్రమోహన్ రాజు, వెంకటరమణ, ఎం.కోటేశ్వరరావు, ఏ.చంగల్ రాజు, జి,ఆదినారాయణ రెడ్డి, డి.చంద్రశేఖర్, నిరంజన్ బాబు, పుల్లంరాజు, ఆర్ చంగల్ రెడ్డి. ఎన్ శివరాజు, వేణుగోపాల్ స్వామి ఆలయ సభ్యులు పాల నరిసింహులు, ఈ.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టిఆర్ విగ్రహానికి టిడిపి నాయకులు పాలాభిషేకం

మదనపల్లె, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :



పట్టణంలోని ఎన్టిఆర్ సర్కిల్లో శనివారం ఎన్టిఆర్ విగ్రహానికి టిడిపి నాయకులు పాలాభిషేకం చేశారు. విజయవాడ వరద బాధితులను ఆదుకోవడంలో ఎమ్మెల్యే షాజహాన్బాషా చేసిన సేవలు అమోఘమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపుమేరకు సుమారు రూ.50లక్షలు విలువ చేసే నిత్యవసర సరుకులు లారీలో తరలించి వరద బాధితులకు ఎమ్మెల్యే అందజేయడం జరిగిందన్నారు. జేసిబి వేణు ఆధ్వర్యంలో ఎన్టిఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి నివాళులర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రంగస్వామినాయుడు, ఎస్సిసెల్ ఉపాధ్యక్షులు సుధాకర్, రామ్మూర్తినాయుడు, రైస్మిల్ శశి, ఎర్రబల్లి వెంకటరమణారెడ్డి, నవీన్చౌదరి, బిల్డర్ రామక్రిష్ణ, జీవి.నాయుడు, మేస్త్రీ శ్రీనివాసులు, చిప్పిలి చెంద్రాయుడు, మాజీ కౌన్సిలర్లు రాధా, పులి మహాలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

## 12వ రోజుకు చేరిన ఆప్కాస్ సిబ్బంది నిరసనలు

మదనపల్లె, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :




తమకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మదనపల్లె ప్రభుత్వ సర్వజన భోదనా ఆసుపత్రిలో జీడీఏలు శనివారం ఉదయం ఆసుపత్రి వద్ద ఆందోళన చేశారు. 12వ రోజు నిరసన కార్యక్రమాలు చేపట్టారు.ఈ సందర్భంగా ఏఐటియుసి పట్టణకార్యదర్శి తిరుమల, ముబారక్, చంద్రా, మల్లికార్జున, సుబ్రమణ్యం, మాధవి, రేవతి, తులసి, ప్రభావతిలు మాట్లాడుతూ అవుట్సోర్సింగ్ కార్మికులకు ఏడునెలలుగా కొందరికి, మరో కొందరికి 13నెలలుగా జీతాలు ఇవ్వకుండా వెట్టిచాకిరి చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెండింగ్లో ఉన్న వేతనాలు చెల్లించాలని కోరారు. వెంటనే సంబంధిత ఉన్నతాధికారులు, కలెక్టర్ స్పందించి ఆప్కాస్ సిబ్బందికి పెండిగ్లోని జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

## క్రీడాకారులను అభినందించిన మాజీ ఎమ్మెల్యే

మదనపల్లె, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :



ఆంధ్రా టి-20 క్రికెట్ టీమ్కు ఎంపికైన క్రీడాకారులు వినయ్కుమార్, దర్శన్రాజులను మాజీ ఎమ్మెల్యే దేశాయ్ తిప్పారెడ్డి, జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ రాటకొండ గురుప్రసాద్లు అభినందించారు. శనివారం క్రీడాకారులు వారిని మర్యాదపూర్వకంగా కలిశారు. రామసముద్రం మండలం తిరుమలరెడ్డిపల్లెకు చెందిన వల్లాల దర్శన్రాజు, వినయ్కుమార్లు టి-20 క్రికెట్ మ్యాచ్కు ఆంధ్రా టీమ్ తరపున ఎంపికైన విషయం తెలిసిందే. ఈనెల 16న నేపాల్లో జరిగే క్రికెట్ పోటీల్లో ఇద్దరు క్రీడాకారులు రాష్ట్రం తరపున ఆడనున్నారు. వీరు గెలిపొంది రాష్ట్రానికి మంచిపేరు ప్రఖ్యాతలు తేవాలని వారు ఆశీర్వదించారు.

## కోలాహాలంగా కురవంకలో గణేషుని నిమర్జనం

మదనపల్లె, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :



పట్టణ సమీపంలోని కురవంకలో శనివారం సాయంత్రం గణేష్ నిమర్జన ఊరేగింపు కోలాహాలంగా జరిగింది. సర్పంచ్ పసుపులేటి చలపతి, బిల్డర్ బోయపాటి మురళీదర్నాయుడుల ఆధ్వర్యంలో గణేష్ నిమర్జన ఊరేగింపు వైభవంగా సాగింది. తొలుత గణేష్ విగ్రహం వద్ద పూజలు నిర్వహించి ఉట్టుకొట్టే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని వేలంపాట పాడారు. ముందుగా సర్పంచ్ చలపతి ట్రాకర్నడిపి ఊరేగింపును ప్రారంభించారు. తదనంత వినాయక నిమర్జన ఊరేగింకు వెళ్లారు. భళ్ళారిడ్రమ్స్, మహిళల చెక్కభజనలతో కోలాహాలంగా ఊరేగింపు జరిగింది. పిల్లలు, పెద్దలు ఊరేగింపులో పాల్గొన్నారు. కురవంక దద్దరిల్లేలా జై బోలో గణేష్ అంటూ నినాదాలు చేశారు.

## ఎన్హెచ్ రోడ్డు పనుల్లో ప్రమాదం - టీప్పర్లోని రాళ్ళుపడి వ్యక్తి మృతి

మదనపల్లె, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :



జాతీయ రహదారి పనులు చేస్తున్న కార్మికులపై ప్రమాదవశాత్తు టిప్పర్లో నుండి రాళ్ళుపడి ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వారిని మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ఒకరు మృతి చెందారు. మరో ఇద్దరిని జిల్లా ఆసుపత్రిలో చికిత్సలు అందించి అక్కడి నుంచి తిరుపతికి తరలించారు. అన్నమయ్యజిల్లా, తంబళ్లపల్లె నియోజకవర్గంలోని బి.కొత్తకోట మండలం, తుమ్మనంగుట్ట వద్ద శనివారం మద్యాహ్నం జాతీయ రహదారి పనుల్లో అపశృతి చోటు చేసుకొంది. టిప్పర్లోని రాళ్ళు అన్లోడ్ చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు కార్మికుల మీద పడడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించగా బీహార్ రాష్ట్రం గోపాల్గంజ్ జిల్లా, లాక్వార్ గ్రామానికి చెందిన అమర్సింగ్ కుమారుడు అతుల్ కుమార్ సింగ్ (45) మార్గమధ్యంలోనే మృతి చెందాడని పరీక్షించిన డాక్టర్లు తెలిపారు. ఈ ప్రమాదంలో గాయపడ్డ మరో ఇద్దరిలో అదే ఊరికి చెందిన పంకజ్కుమార్సింగ్ (43) మహారాష్ట్రకు చెందిన రామ్ద్యాన్(45)లను ప్రథమ చికిత్సలు అనంతరం తిరుపతికి తరలించారు. బి.కొత్తకోట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## మదనపల్లెలో దొంగలు అరెస్టు

మదనపల్లె, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :



గుడిలో చోరీకి పాల్పడిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు మదనపల్లె తాలూకా సిఐ కళా వెంకటరమణ తెలిపారు. మదనపల్లె మండలం మొలకలదిన్నె క్రాస్లోని గంగమ్మ ఆలయంలో హరీష్, సాయిప్రతాప్ చోరీకి పాల్పడ్డారు. నాలుగు రోజుల క్రితం అర్థారాత్రి ఇద్దనరూ గుడి తలుపులు పగలుకొట్టి బంగారు తాళిబొట్టును దొంగలించారు. సిసి కెమరాల ఆధారంగా ఇద్దరిని అరెస్టు చేశామన్నారు.

## ప్రధాన రహదారిలో గుంతలను పూడ్చండి

నిమ్మనపల్లె, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :



మదనపల్లె నుంచి నిమ్మనపల్లెకు వెళ్ళే ప్రధాన రహదారి అంతా అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. దీంతో రైతులు, వ్యాపారస్తులు అవస్థులు పడుతున్నట్లు తెలిపారు. ఈ రోడ్డును వెళ్లాలంటే నరకయాతన చూస్తున్నామని, ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని తెలియజేశారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి రోడ్డుమీద గుంతలను పూడ్చాల్సిందిగా తెలిపారు.

# వరదబాధితులకు చీరెలు పంపిణీ

చెన్నూరు, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త



మండలంలోని కొక్కరాయపల్లె గ్రామానికి చెందిన ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హేమలత మానవత్వాన్ని చాటుకోవడం జరిగింది. వరదల కారణంగా విజయవాడ పరిసర ప్రాంతాలలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న విషయం అందరికి తెలిసిందే. తన వంతు సాయం చేయుటకు మండలంలోని కొక్కరాయపల్లె ప్రాథమిక పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయురాలు హేమలత విజయవాడలో రాజీవ్నగర్ వరద బాధితులకు చీరల పంపిణీ చేయడం హర్షించదగ్గ విషయమని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ చెన్నూరు మండల ప్రధాన కార్యదర్శి వీరనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులు కేవలం పాఠశాలలోనే కాకుండా పాఠశాల బయట సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం ఎంతో అభినందనీయమని ఈ సందర్భంగా తెలిపారు.

## సీఐటీయూకు సంబంధం లేని వ్యక్తులను సీఐటీయూ సంఘానికి ఆపాదించడం ఈ ప్రకటన ఖండిస్తున్నాం

జమ్మలమడుగు, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:



జమ్మలమడుగు సీఐటీయూ అధ్యక్షుడు జి.ఏసుదాసు, కార్యదర్శి దాసరి విజయ్ సంయుక్త ప్రకటనలో మాట్లాడుతూ సీఐటీయూ అన్ని వర్గాల కార్మికులను కలుపుకొని ప్రజా సమస్యలపైన నిరంతరం పోరాటాలు చేస్తుంది. వీటికి ఆకర్షితులైన అన్ని రంగాల కార్మికులు సీఐటీయూలో చేరుతున్నారు. సంఘం అభివృద్ధిని చూసి ఓర్వలేక కొంత మంది దుర్మార్గులు సంఘంపైన బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ అంశంపైన కఠిన చర్యలు ఉంటాయని వారు హెచ్చరించారు. సెప్టెంబరు 12న పత్రికా ప్రకటనలో వచ్చిన సీఐటీయూ నుంచి కొంత మంది కార్మికులు ఏఐటీయూసీలోకి వచ్చారని ఆ సంఘ నాయకులు మిడుతూరు ప్రసాద్, సిరివెల్ల లక్ష్మీనారాయణ ప్రకటన ఇచ్చారు. మా సంఘానికి సంబంధం లేని వ్యక్తులను సీఐటీయూకు ఆపాదించడం నీతిమాలిన ప్రకటనగా భావిస్తున్నామని వారు తెలిపారు. సీఐటీయూ వర్కర్లకు కార్మికులకు విజ్ఞప్తి చేస్తున్నాం సిరివెల్ల లక్ష్మీనారాయణ ఈయన అనుచరులు మరో ముగ్గురు వర్కర్లను బెదిరించి అక్రమంగా లక్షల రూపాయలు వసూలు చేసిన డబ్బులను పోలీసుల ద్వారా మీకు డబ్బు ఇప్పించేందుకు సీఐటీయూ నాయకులు సిద్ధంగా ఉన్నామని వారు వర్కర్లకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కరీముల్లా, మహమ్మద్ పాల్గొన్నారు.

## కలికిరి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు

కలికిరి, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:



కలికిరి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు నిత్యం మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు కలికిరి ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ వై.పవన్కుమార్ సూచించారు. శనివారం ప్రభాతవార్త కలికిరి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై సూపరింటెండెంట్ను పలకరించడం జరిగింది. ఈ సందర్భంగా పవన్కుమార్ మాట్లాడుతూ నిత్యం ప్రభుత్వ ఆసుపత్రికి సుమారు 400 మంది రోగులు చికిత్సల నిమిత్తం ఆసుపత్రికి వస్తున్నారని ఓపీ అత్యధికంగా పెరిగిందన్నారు. చికిత్స కోసం వచ్చే రోగులకువైద్యాధికారులు, వైద్యసిబ్బంది సకాలంలో స్పందిస్తూ వైద్యచికిత్సలు అందించడం జరుగుతోందన్నారు. కలికిరి అప్పటి మాజీ సీఎం నల్లారి కిరణ్కుమార్రెడ్డి 30 పడకల ఆసుపత్రిని మంజూరు చేయించడం జరిగింది. ఆసుపత్రి రోజు రోజుకు అభివృద్ధి చెందుతూ మండలంలోని రోగులకే కాకుండా పక్క మండలాల నుంచి అధిక సంఖ్యలో రోగులు ఆసుపత్రికి వస్తున్నారు. 24 గంటలు వైద్యాధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండి చికిత్సలు అందిస్తున్నారన్నారు. రోగులకు అన్ని రకాల సేవలు ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నట్లు సూపరింటెండెంట్ పేర్కొన్నారు. రోగులు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లనవసరం లేదని కలికిరి ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే అన్ని వైద్య సౌకర్యాలు రోగులకు కల్పించి వైద్యసేవలు అందించడం జరుగుతుందని ఆసుపత్రిలో అందించే వైద్య సేవలను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారులు పేర్కొన్నారు. ఆసుపత్రిలో కు.ని చికిత్సలు కూడా జరుగుతున్నాయన్నారు. రోగులకు సంబంధించి రక్త పరీక్షలు, గర్భవతులకు స్కానింగ్ సౌకర్యం వంటి అన్ని రకాల సదుపాయాలు ఉన్నాయని తెలిపారు.

## మానవత ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం

చిన్నమండెం, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త :

మండలంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ఆదివారం మానవత చిన్నమండెం శాఖ వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మానవత సంస్థ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరం రాయచోటిలోని మదనపల్లె రోడ్డులో ఉన్న వెంకటేశ్వర మల్టీ స్పెషాలిటి ఆసుపత్రి వారి సౌజన్యంతో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరం నందు అన్ని వ్యాధులకు పరీక్షలు చేయడం జరుగుతుందని, స్త్రీల వ్యాధులు, దంత పరీక్షలు, చిన్న పిల్లలకు ఉచితంగా పరీక్షలు చేసి మందులు ఇవ్వడం అందించడం జరుగుతుందన్నారు. అలాగే ఉచితంగా షుగర్, బి.పి పరీక్షలు కూడా చేయడం జరుగుతుంది. వైద్యులు వెంకటేశ్వరరెడ్డి, జనకిరామ్, సిఎస్ భువనేశ్వరి, టి. స్వాతిరెడ్డిలు పాల్గొని వైద్య సేవలు అందిస్తారన్నారు. ఈ శిబిరం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు.

## శ్రీ శ్రీ శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానానికి రూ.50,116- విరాళం ఇచ్చిన భక్తుడు

చక్రాయపేట,సెప్టెంబర్ 14 ,ప్రభాతవార్త:



రాయలసీమ జిల్లాలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన గండిక్షేత్రం శ్రీ వీరాంజనేయ స్వామి వారి శాశ్వత నిత్యాన్నదాన పథకానికి సింహాద్రిపురం మండలంలోని కంబల్లి గ్రామ వాస్తవ్యులు ముల్లుకుంట్ల వెంకట నాగిరెడ్డి, చిన్నపుల్లా రెడ్డిలు రూ.50,1116/- విరాళాన్ని సమర్పించారని ఆలయ అసిస్టెంట్ కమీషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు.వారికి ఆలయ ప్రధాన అర్చకులు కేసరి స్వామి ప్రత్యేక దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలు అందజేసి,శేష వస్త్రం,స్వామి వారి చిత్రపటాన్ని అందజేసి వేద ఆశీర్వచనం చేశారు.ఈ సందర్బంగా దాతలు మాట్లాడుతూ స్వామి వారి దర్శనార్థం వచ్చే భక్తులకు నిత్యాన్నదానం ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ అర్చక బృందం,ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఒనిపెంట కెవికెలో పూల సాగు పై రైతులకు అవగాహన

మైదుకూరు సెప్టెంబర్ 14,ప్రభాతవార్త:



మైదుకూరు మండల పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో శాస్త్రవేత్తలు కమిటీ చామంతి నేల సంపంగి పూల సాగు,విలువ జోడింపు విధానాల పై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. వికసిత్ భారత్ 100 రోజుల కార్యక్రమంలో భాగంగా గత నాలుగు రోజులుగా మిరప ఉల్లి పసుపు టమోటా పంటల సాగు యాజమాన్య పద్ధతుల పై శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి డాక్టర్ బాలకృష్ణ తెలిపారుఐదవ రోజు కార్యక్రమంలో భాగంగా పూల పంటల సాగుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ పూల పంటల సాగులు పాటించవలసిన భూసార పరిమితులు ఎరువుల యాజమాన్యం నేల రకాలు విత్తన రకాలు మొదలైన విషయాలు గురించి సమగ్రంగా వివరించారు.అలాగే రైతులందరూ ఈ విధానాలను పాటించి మంచి దిగుబడులు పొందాలని కోరారు. డాక్టర్ ఫిరోజ్ హుస్సేన్ సాగులో భాగంగా పూల తోటల్లో ఆశించే చీడపీడల గురించి అలాగే వాటిని నివారించే విధివిధానాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి ఎస్ కాంతిశ్రీ పూల కోత అనంతరం తీసుకోవలసిన జాగ్రత్తల గురించి మరియు పూలల్లో విలువ జోడింపు, విధానాలు, ముఖ్యంగా పరిమళ ద్రవ్యాలు, నూనెల ఉత్పత్తి గురించి, సహజ రంగుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్ కుమార్, బాల నరసింహారెడ్డి మరియు సిబ్బంది, రైతులు,రైతు మహిళలు పాల్గొని జయప్రదం చేశారు.

## రాజీమార్గమే రాజమార్గం

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త:



క్షణకావేశంలో గొడవలు పడకుండా చిన్న చిన్న విషయాలు రాజీ పడడమే రాజమార్గమని లక్కిరెడ్డిపల్లె సివిల్ జడ్జీ షేక్ ఫైజు పేర్కొన్నారు.శనివారం లక్కిరెడ్డిపల్లె కోర్టు నందు జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా గతంలో పరిష్కారంకాని సివిల్ కేసులు, బ్యాంక్ల ద్వారా తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించిన మొండిబకాయిల లోక్ అదాలత్ పరిష్కరించుకోవచ్చని కోర్టు వర్గాలు తెలిపారు.58 కేసులగాను 3,85,800 రూపాయలు కేసుల సమస్యలు పరిష్కారం అయినట్లు వారు తెలిపారు. గ్రామాలల్లో భూ తగాదాలు, చిన్న చిన్న గొడవలు,ఇంటి స్థలాలు సమస్యలు గ్రామంలోనే పరిష్కరించుకోవాలని ప్రతి సారి పోలీసు స్టేషన్, కోర్టుల చుట్టూ తిరగదని జడ్జి కడదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఎంఎల్ వివి రామచంద్రారెడ్డి, రెడ్డెన్న, చెన్నక్రిష్ణయ్య, పోలీసు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్డీఏ ప్రభుత్వ పాలనలో రాబోవు నాలుగేళ్లలో
# రాష్ట్రం ప్రగతి పథంలో పయనిస్తుంది




**రాయచోటి, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:**
బడి నుంచి గుడి వరకు అన్నీ తాకట్టు పెట్టి కల్కి సినిమా విలన్‌లాంటి దుర్మార్గుడు జగన్‌రెడ్డి అని తెదేపా రాష్ట్ర కార్యదర్శి కుప్పం నియోజకవర్గ పరిశీలకులు గాజుల ఖాదర్ బాషా ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని రంగాల్లో రాష్ట్రం అభివృద్ధి జరుగుతుందని రాబోవు నాలుగేళ్లలో రాష్ట్రం ప్రగతి పథంలో పయనిస్తుందని అభివృద్ధి ఏంటో ప్రజలకు చంద్రబాబునాయుడు, పవన్ నాయకత్వంలో తెలుస్తుందన్నారు. రాబోవు 15 ఏళ్లలో వచ్చే ఆదాయంపై కూడా అప్పు చేశారని జగన్ పాలనపై మండిపడ్డారు. ప్రజల మధ్యనే ఉంటూ వారి సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు చంద్రబాబునాయుడు తీసుకుంటారని తెలిపారు. ఈ సమావేశంలో తెదేపా నాయకులు అంజాద్ అలీఖాన్, చిన్నమండెం మండల నాయకుడు రాజు, నాగరాజు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా వ్యాప్తంగా 3200 కేసులు పరిష్కారం

**కడప లీగల్, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:**
జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా వ్యాప్తంగా 3200 కేసులు పరిష్కరించడం జరిగిందని కక్షిదారులకు రూ.6,24,18,818 చెల్లించడం జరిగిందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి జి.శ్రీదేవి, సీనియర్ సివిల్ జడ్జీ ఎస్.బాబాఫకృద్దీన్‌లు తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు మరియు లోక్ అదాలత్ మెంబర్లు, కక్షిదారులు వారి వారి న్యాయవాదులతో సంప్రదింపులు జరిపి వారి వారి కేసులను పరిష్కరించుకోవడం జరిగిందన్నారు. ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా కృషి చేసినందుకు న్యాయవాదులకు, రెవెన్యూ సిబ్బందికి, పోలలీసు అధికారులు, వైద్యాధికారులు, పత్రికా సిబ్బంది, జిల్లా పబ్లిక్ రిలేషన్ అధికారులకు, రవాణాశాఖాధికారులకు, ఇన్సూరెన్స్, బ్యాంక్, చింట్‌ఫండ్, లేబర్, మున్సిపల్, బీఎస్ఎన్ఎల్, ఏపీఎస్పీడీసీఎల్, రవాణా, ఆల్‌ఇండియా రేడియో, ఎక్సైజ్, అగ్రికల్చర్ తదితర శాఖల అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## రోడ్డు ప్రమాదం కేసులో రూ.1.20 కోట్లు పరిష్కారం

**కడప లీగల్, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:**
జాతీయ లోక్ అదాలత్‌లో రోడ్డు ప్రమాదం కేసుకు సంబంధించి రూ.1.20 కోట్లు పరిష్కారం జరిగింది. కోవూరు కృష్ణవేని మాట్లాడుతూ తన భర్త రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించడం జరిగింది. బజాజ్ అలియన్స్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ వారు జాతీయ లోక్ అదాలత్ నందు వాది తరుపున న్యాయవాది ఆదినారాయణరెడ్డి, ప్రతివాది తరుపున న్యాయవాదులు సాయి వంశీకృష్ణ, రాజశేఖర్‌రెడ్డి ఆదినారాయణరెడ్డి సంప్రదింపులు జరిపి జాతీయ లోక్‌అదాలత్‌లో తనకు 1.20 కోట్లు పరిష్కరించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా న్యాయవాదులకు సంబంధిత అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## సఫలీకృతమైన జాతీయ లోక్ అదాలత్

**బద్వేల్ లీగల్ ,సెప్టంబర్14,ప్రభాతవవార్త :**
జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆధ్ర రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సూచనల మేరకు జిల్లాలోని అన్ని న్యాయ స్థానములలో చేపట్టిన జాతీయ లోక్ అధాలత్‌లో భాగంగా శనివారం ఉదయం 10.30గంటలకు బద్వేలు న్యాయ స్థాన పరిధిలోని బద్వేల్ న్యాయ స్థాన ప్రాంగణంలో మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్ మరియు బద్వేలు సీనియర్ సివిల్ జెడ్జి వై.జె. పద్మశ్రీ ఆధ్వర్యంలో లోక్ అధాలత్ నిర్వహించడం జరిగినది. ఈ లోక్ అధాలత్‌లో మొదటి బెంచి వై.జె.పద్మశ్రీ సీనియర్ సివిల్ జెడ్జి బద్వేలు రెండవ బెంచి బి. గాయత్రి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి మరియు బెంచి మెంబర్లు, సోషల్ వర్కర్సు మరియు సీనియర్. జూనియర్ న్యాయవాదులు పి.వి.ఎన్.ప్రసాద్, ఈ.సి.ఓబల్ రెడ్డి,పి. రాజేశ్వర రావు, ఆర్.ఆర్.వర్మ, డి.బ్రహ్మారెడ్డి, ప్రదీప్ పవార్, పి.శివశంకర్ రెడ్డి, రూపరాజు ఉమామహేశ్వర్ రావు, ఎస్.వాసుదేవరావు, ఎస్,రమణా రెడ్డి, మువ్వా నరశింహులు,సూర్యనాయాయణ రెడ్డి, సురేష్, రాచపూడి సాయి కృష్ణ, డి.వి. ఎస్. కృష్ణ మరియు కక్షిదారులు, ప్రజలు, పోలీసు సిబ్బంది పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. ఈ కార్యక్రమములో రాజీ పడదగ్గ రూ.39,45,244/లు, విలువ గల మొత్తం 364 వ్యాజ్యములు పరిష్కరించబడినవి. ఇందులో రూ.15,29,143/లు విలువ గల 352 క్రిమిలన్ వ్యాజ్యములు, రూ.24,16,101/లు విలువ గల 12 వ్యాజ్యములు పరిష్కరించబడినవి. ఈ సందర్భంగా న్యాయమూర్తులు ప్రసంగిస్తూ లోక్ అదాలత్ తీర్పులు భారత దేశం అత్యున్నత న్యాయస్థాన తీర్పులతో సమానమని, వీటికి అప్పీళ్ళు కూడా లేవని, కావున కక్షిదారులందరూ రాజీ పడదగ్గ యావత్తు సివిల్, క్రిమినల్ వ్యాజ్యములను భవిష్యత్తులో జరగబోవు ఈ లోక్ అదాలత్‌ల ద్వారా పరిష్కరించుకొని న్యాయ స్థానములకు వివిధ వ్యాజ్యములు పరిష్కరించుటలో జాప్యమును నివారించి సత్వర వ్యాజ్యముల పరిష్కారములకై అవకాశాన్ని కలగచేయవలయునని తెలియజేశారు.




## వేలంలో రూ.1.08లక్షలు పలికిన వినాయకుడి లడ్డూ

**పులివెందుల, సెప్టెంబరు 14, ప్రభాతవార్త ః**
పులివెందులలోని మారుతిహాల్ రోడ్డులో వెలసిన ఏకలవ్య వినాయక అసోసియేషన్ వారు ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద ఉంచిన లడ్డూను శనివారం వేలం పాటలు నిర్వహించారు. అంబకపల్లెకు చెందిన పూజారి హర్షవర్ధన్‌రెడ్డి, కమతం మహీదర్‌లు రూ.1.08లక్షలకు వేలం పాడి లడ్డూను కైవసం చేసుకున్నారు. మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్ వీరికి లడ్డూను అందించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహక కమిటి సభ్యులు పెనుగొండ తరుణ్, చిన్న పెనుగొండ అరుణ్‌కుమార్, కాకి వీరాంజనేయులు, నవీన్, మహేంద్ర, మహమ్మద్, సన్ని, అత్తు, వంశీ, కార్తీక్, భక్తులు పాల్గొన్నారు.



## కమనీయంగా సాగిన శ్రీరంగనాథుడి కల్యాణం

**పులివెందుల, సెప్టెంబరు 14, ప్రభాతవార్త ః**
పులివెందులలో వెలసిన శ్రీరంగనాథస్వామి కల్యాణ మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. గత వారం రోజులుగా స్వామివారికి నూలు పూజ మహోత్సవాలు ఆలయంలో నిర్వహిస్తున్నారు. ఈ పూజ కార్యక్రమాల అనంతరం స్వామివారికి భూదేవి, శ్రీదేవి సమేత శ్రీరంగనాథస్వామి కల్యాణాన్ని ఆనవాయితిగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం శ్రీరంగనాథస్వామి ఆలయ కల్యాణ మండపం నందు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథస్వామికి వేద పండితులు వేద మంత్రోచ్ఛారణల మధ్య కల్యాణాన్ని వైభవంగా చల్లా వంశీయుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం స్వామివారి ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలందరు పాల్గొన్నారు. ఉదయం నుండి నిర్వహించిన స్వామివారి అభిషేక, అర్చన కార్యక్రమాల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులయ్యారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్, మార్కెట్ కమిటి మాజీ ఛైర్మన్ చిన్నప్ప, కోఆప్షన్ సభ్యుడు చంద్రమౌళి, ఈవో రమణ, ఆలయ పూజారి రాజేష్‌శర్మ, చల్లా వంశీయులు పాల్గొన్నారు.



## విద్యార్థులు నైపుణ్యం పెంపొందించుకోవాలి

**వేంపల్లె, సెప్టెంబరు 14, ప్రభాతవార్త ః**
ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు ప్రతి రంగంలోను నైపుణ్యం పెంపొందించుకోవాలని ఐబీఎం స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ప్రతినిధి నాగరాజు అన్నారు. ఇంజినీరింగ్ సెకండ్, థర్డ్, ఫోర్త్ ఇయర్ స్టూడెంట్స్ ఈ ప్రోగ్రాంలో పాల్గొన్నారు. ఈ ప్రోగ్రాం పూర్తయిన వెంటనే ఒక్కొక్క విద్యార్థికి సర్టిఫికెట్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమం విజయవంతం అవడం పట్ల ట్రిపుల్‌ఐటీ డైరెక్టరు ప్రొఫెసర్ కుమార్‌స్వామి గుప్తా, రిజిస్ట్రార్ అమరేంద్రకుమార్, ఏవో రవికుమార్, డీన్ రత్నకుమారి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సుందర్, వినోద్, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.



## గణేష్ ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, పొలిట్ బ్యూరో సభ్యులు



**కడప వైద్యవిభాగం, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:**
గణేష్ ఉత్సవాల్లో భాగంగా ఎమ్మెల్యే మాధవిరెడ్డి, పొలిట్ బ్యూరో సభ్యులు టీడీపీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డిలు నగరంలోని సాయిపేట పోలేరమ్మ గుడి వద్ద ఏర్పాటు చేసిన గణనాథుడిని దర్శించుకొని అక్కడ నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వల్లూరు వంశీనాథ్‌రెడ్డి, పాలెంపల్లె సుబ్బారెడ్డి, పవన్, యువరాజ్, చంద్ర, రాజా, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్త మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరిస్తే ఉద్యమిస్తాం

**పోరుమామిళ్ల రూరల్, సెప్టెంబరు 14 ప్రభాతవార్త :**
రాష్ట్రంలో కొత్త మెడికల్ కళాశాలలపై సీఎం చంద్రబాబు తన నిర్ణయం మార్చుకోకుండా ప్రైవేటీకరిస్తే తమ పార్టీ పరంగా ఉద్యమస్తామని ఎమ్మెల్సీ డిసి.గోవిందరెడ్డి హెచ్చరించారు. పేద విద్యార్థులకు వైద్య విద్యను రాష్ట్ర ప్రభుత్వం దూరం చేస్తూ వారికి తీరని అన్యాయం చేస్తోందని మండి పడ్డారు. వైద్యవిద్యను విద్యార్థులకు మరింత చేరువ చేసేందుకు వైఎస్ జగన్ ఒకేసారి 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలకు శ్రీకారం చుట్టి అందులో ఐదు కళాశాల లను గత ఏడాది ప్రారంభించారని, అన్ని ఏర్పాట్లు చేస్తే ప్రస్తుత ప్రభుత్వం ప్రైవేటు జపం చేస్తూ వాటితో పాటు మిగిలిన వాటికి మంగళం పాడుతోందని విమర్శించారు. పులివెందుల మెడికల్ కళాశాలలకు మంజూరైన 50 సీట్లు వద్దంటూ లేఖ రాశారన్నారు. అలాగే నేరస్తుడితో రాజకీయమా అంటూ జగన్‌ను ఉద్దేశిస్తూ సీఎం చేసిన వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. రాజకీయాలలో చంద్రబాబును మించిన నేరస్తుడు లేరన్నారు. వరద సహాయక చర్యలలో సీఎం ఘోరంగా విఫలమయ్యారని, దీనినుంచి ప్రజలను మరళిచేందుకు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు.



## కువైట్‌లో చిక్కుకున్న మహిళకు నారాలోకేష్ హామీ

**నిమ్మనపల్లె, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :**
అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లెకు చెందిన మహిళ కువైట్‌లో చిక్కుకున్న తనను స్వదేశానికి తీసుకురావాలని వేడుకొంటూ సెల్ఫీ వీడియోను విడుదల చేసింది. దానికి మంత్రి నారా లోకేష్ స్పందించారు. అమ్మా మీకు వచ్చిన కష్టం నా దృష్టికి వచ్చింది. కువైట్ నుంచి మిమ్మల్ని తీసుకొచ్చే భాద్యత నాది అని ఎక్స్ వేదికగా హామీ ఇచ్చారు. అయితే మహిళ భర్త నాలుగు రోజుల క్రితం మృతి చెందాడని విషయం చెప్పినప్పటికి యజమానులు పంపలేదని వివరించింది.

## పగలే వెన్నెల

**పోరుమామిళ్ల రూరల్, సెప్టెంబరు 14 ప్రభాతవార్త :**
పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటుచేసిన విద్యుత్ దీపాలు పగలు, రాత్రి అనే తేడా లేకుండా 24 గంటలు వెలుగుతూనే ఉంటాయి. ఈ తతంగం అంతా దాదాపు రెండు నెలల నుండి జరుగుతూ ఉంది. దీనిపై అధికారులు చూసి చూనట్లు వివరించడం ఎంతవరకు సమంజసం, విద్యుత్ దీపాలను స్విచ్ ఆన్ మరియు ఆఫ్ చేసే ఎవరు బాధ్యత వహించాలి, విద్యుత్ దీపాలకు కరెంటు చార్జీలు ఉన్నాయా లేక ఉచిత కరెంటా అని ప్రజలు అనుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి ప్రభుత్వ ఆదాయాన్ని గండి కొట్టాకుండా చూస్తారేమో వేచిచూడాలి



## నాకు న్యాయం చేయాలంటూ తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా

**బద్వేలు, సెప్టెంబరు 14 ప్రభాతవార్త :**
తన భూమిని ఆక్రమించి తనను ఇబ్బందులకు గురిచేస్తున్న వారిపై చర్యలు చేపట్టాలని కోరుతూ కత్తెరపల్లె నారాయణమ్మ అనే మహిళ తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బద్వేలు మండలంలోని చెన్నంపల్లె రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 1769/2లో ఉన్న తన స్థలాన్ని కొంతమంది వైసీపీ నేతలు ఆక్రమించారని, తనకు ముందే ఆరోగ్యం సరిగా లేదని, ఉన్న ఆ స్థలాన్ని వారు కబ్జా చేస్తే తనను ఆదుకునేది ఎవరని ఆమె ప్రశ్నించారు. ఇందుకు స్పందించిన తహశీల్దారు బాధితురాలితో మాట్లాడి న్యాయం చేసేందుకు కృషిచేస్తానని హామి ఇచ్చారు.ఈ ధర్నాలో ఆమెతో పాటు గురవయ్య, పలువురు బాధితులు ఉన్నారు.



## లక్ష్మినరసింహ స్వామికి పూజలు

**బద్వేలు, సెప్టెంబరు 14 (ప్రభాతవార్త):**
బద్వేలు నియోజకవర్గంలోని వల్లెలవారిపల్లె గ్రామంలో వెలసిన స్వయంభు లక్ష్మినరసింహ స్వామి ఆలయంలో శనివారం బాద్రపదమాసం రెండవ శనివారాన్ని పురస్కరించుకుని లక్ష్మినరసింహ స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి, అమ్మవారిని గంధం, కుంకుమ విభూదితో ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనంఇచ్చారు. స్వామివారిని దర్శించుకునేందుకు దూర ప్రాంతాల నుంచి అనేకమంది భక్తులు వస్తున్నారని, స్వామివారిని దర్శించుకోవడం వలన ఏలిన నాటి శని మరియు చీడ, పీడలు తొలగుతాయని భక్తుల విశ్వాసం. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమానికి నెల్లూరు జిల్లా కంప సముద్రం గ్రామానికి చెందిన గోపవరం వెంకటసుబ్బారెడ్డి, ఆయన ధర్మపత్ని అనూషలు సహకరించారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామప్రజలు, పెద్దలు పాల్గొన్నారు.



## అధికార పార్టీపై నిందలు వేయడం సరికాదు

**బద్వేలు, సెప్టెంబరు 14 (ప్రభాతవార్త):**
మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికార పార్టీపై అపనిందలు వేయడం సరికాదని బద్వేలు నియోజకవర్గ జనసేన సమన్వయకర్త బసివి రమేష్ పేర్కొన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శుక్రవారం పిఠాపురంలో జగన్‌మోహన్‌రెడ్డి తన నోటికి ఇష్టం వచ్చినట్లు మాట్లాడి, అధికార పార్టీపై పచ్చి అబద్దాలు చెప్పారని, ఆయన అధికారంలో ఉన్న సమయంలో సొంత జిల్లాలో అన్నమయ్య డ్యాం కట్టలు తెగి వరదలు వచ్చినపుడు అక్కడి ప్రజల అవస్థలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విజయవాడలో వచ్చిన వరదల నుంచి ప్రజలను కాపాడి అలాగే ఈస్ట్, వెస్ట్ గోదావరి వాసులకు ఏ ఇబ్బంది కలగకుండా వరదల నుంచి కాపాడి రాష్ట్రాన్ని గాడిలో పెడుతూ ప్రజల మన్ననలు పొందుతున్నారని, అలాగే ఆయన ఏపీకి 5 కోట్లు, తెలంగాణాకు కోటి రూపాయలు సొంత నిధులను ప్రజలకు సహాయం చేశారని, ఏనాడైనా నువ్వు మీ పార్టీ వారితో మాట్లాడి ఇస్తానన్న కోటి రూపాయలు విరాళం ఏమైందని ప్రశ్నించారు.ప్రజా సొమ్ము దోచుకుని దాచుకునే నీకు మంచి చేయాలనే ఆలోచన ఎలా ఉంటుందని, నీలాంటి వ్యక్తి నుంచి రాష్ట్రాన్ని కాపాడిన వ్యక్తి పవన్ కళ్యాణ్ అని ఆయనకు ప్రజలు రుణపడి ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటసుబ్బయ్య, రాజారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, అనిల్‌కుమార్, అశోక్, పెంచలయ్య తదితర జనసైనికులు పాల్గొన్నారు.




## వెంకటేశ్వరస్వామికి పవిత్ర సమర్పణ

**తంబళ్లపల్లె, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:**
తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లె శ్రీప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం స్వామి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి పవిత్ర సమర్పణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయ డిప్యూటీ ఈవో వరలక్ష్మీ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణ ప్రసాద్ భట్టార్, ఆలయ అర్చకులు రమేష్‌బాబు, వేద పారాయణుల ఆధ్వర్యంలో చతుష్టార్చనం, పూర్ణాహుతి కార్యక్రమం మధ్యాహ్నం పవిత్ర సమర్పణ, సాయంత్రం చతుష్టార్చనం, పూర్ణాహుతి కార్యక్రమాలు వైభవోపేతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వెంకటేశ్వర స్వామి భక్తులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్స్పెక్టర్ దుష్యంత్‌కుమార్, నగేష్, రవి తదితరులు పాల్గొన్నారు.



## డ్రాయింగ్‌లో విద్యార్థుల ప్రతిభ

**వేంపల్లె, సెప్టెంబరు 14, ప్రభాతవార్త ః**
హిందీభాషా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చూపారు. శనివారం హిందీభాషా దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో బాలుర పాఠశాలకు చెందిన ధనుంజయ్, రామ్‌చరణ్, భువనేశ్వర్, హమీద్, భరత్, మనోహర్, బాలకార్తీక్, ఫజల్‌ఖాన్ అనే విద్యార్థులు ప్రతిభ చూపడం ఆ విద్యార్థులకు హెచ్ఎం శివమునెమ్మ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఆంగ్లంతో పాటు హిందీభాషపై పట్టు సాధిస్తే దేశంతో ఎక్కడైనా ఆయా రంగాల్లో పనిచేయవచ్చన్నారు. అలాగే హిందీభాషపై విద్యార్థులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డ్రాయింగ్ మాస్టర్ సురేష్‌కుమార్, పర్వీన్, లతా, హరినాథ్ పాల్గొన్నారు.



## కడప-రేణిగుంట జాతీయ రహదారికి
# అటవీ అనుమతులు ఇప్పించండి

**వేంపల్లె, సెప్టెంబరు 14, ప్రభాతవార్త ః**
కడప-రాజంపేట-రైల్వేకోడూరు-రేణిగుంట జాతీయ రహదారి ప్రధానమైన రహదారి అని, నిరంతరం రద్దీగా ఉంటుందని పీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి తెలిపారు. చెన్నై-ముంబై మహానగరాలను అనుసంధానం చేసే రహదారి ఇది అన్నారు. రూ.2254కోట్లతో 122కిలోమీటర్ల పొడవుతో 4 వరుసల రహదారిని కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. 11 నెలలు గడిచినా గుత్తేదారు పనులు ప్రారంభించలేదన్నారు. 100 హెక్టార్ల అటవీ భూమికి సంబంధించి అనుమతులు మంజూరు కాని కారణంగా పనులు మొదలు పెట్టలేదన్నారు. ఈ విషయమై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆయా శాఖల మంత్రులు స్పందించి జాతీయ రహదారికి అటవీ అనుమతులు ఇప్పించాలని తులసిరెడ్డి కోరారు.



## నూతన పోళ్లు, విద్యుత్ తీగలు

**రైల్వే కోడూరు అర్బన్,సెప్టంబర్14,ప్రభాతవవార్త :**
కోడూరు నియోజకవర్గంలోని మాధవరం పోడు గ్రామంలో దశాబ్దాల తరబడి మార్చవలసిన విద్యుత్ పోళ్లు కొన్ని సంవత్సరాలుగా ప్రమాదకరంగా తీగలు వేలాడుతున్నా విద్యత్ తీగలను గ్రామవాసులు అభ్యర్థన మేరకు చూసిన టిడిపి ఇన్‌చార్జి ముక్కా రూపానంద రెడ్డి వాటిని ఎక్కడైతే ప్రమాదకరంగా ఉన్నాయో అక్కడ నూతనంగా పోళ్లు ఏర్పాటు చేయమని కొత్త విద్యుత్ తీగలు లాగమని చెప్పడంతో స్పందించిన విద్యుత్ సిబ్బంది వెంటనే వాటిని మార్చారు. ఈ సందర్భంగా ఆ గ్రామ ప్రజలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.
















